@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | శనివారం 06, ఏప్రిల్ 2024 | పేజీలు: 04

## ప్రభుత్వ అసమర్థతతో
# సంక్షోభంలో వ్యవసాయరంగం



- పంటలకు నీరందించడంలో కొరవడిన ముందుచూపు
- మేము సస్యశ్యామలం చేసిన రాష్ట్రం ఆగమైంది
- నాలుగు నెలల్లోనే పాలన అస్తవ్యస్తం
- రైతుబంధు, రుణ మాఫీ, దళితబంధు, తులం బంగారమేది?
- కరీంనగర్ పర్యటనలో కెసిఆర్ విమర్శలు

**నేటి ఫోకస్ న్యూస్, రాజన్న సిరిసిల్ల-ఏప్రిల్5:**

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగానే వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్ర శేఖర్‌రావు అన్నారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ వైఫల్యమేనని అన్నారు. నాలు గైదు నెలల్లోనే కరీంనగర్ ఏడారి అయ్యిందన్నారు. దళితబంధు, రైతు రుణమాఫీ, కళ్యాణలక్ష్మిలో తులం బంగారం వంటి హామీలను నెరవేర్చనందుకు వీరంతా కర్రుకాల్చి వాతలు పెట్టడం ఖాయమని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు రెఫరెండం అంటున్న వీరికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 'పొలంబాట'లో భాగంగా శుక్రవారం నాడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. సాగునీరందక ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. అన్నదాతలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మిగతా 2లో..





# నేడే జనజాతర

## లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ శంఖారావం

### పార్టీ మేనిఫెస్టో రిలీజ్ చేయనున్న రాహుల్‌గాంధీ..

### 10 లక్షలకు పైగా జనసమీకరణ.. భారీగా ఏర్పాట్లు పూర్తి...

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్ 5:**

తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించనుంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇక్కడి నుంచే ఆరు గ్యారంటీలను ప్రకటించి.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. తాజాగా లోక్‌సభ ఎన్నికల్లోనూ సెంటిమెంట్‌ను కొనసాగించాలని నిర్ణయించింది. సెప్టెంబర్ 17న ఏర్పాటు చేసిన సభా ప్రాంగణాన్నే జాతీయ గ్యారంటీల ప్రకటనకు వేదికగా చేసుకుంది. 25 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన వేదికకు ఇరువైపులా భారీ వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. రాజీవ్ ప్రాంగణంగా నామకరణం చేసిన వేదికపై ఏఐసీసీ ముఖ్య నేతలు సహా ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు మిగతా 2లో..

### పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారెంటీ

- రైతు, యువత, మహిళలకు న్యాయం..
- అభివృద్ధిలో భాగస్వామ్యం..
- సెంట్రల్ మేనిఫెస్టో విడుదల చేసిన కాంగ్రెస్ అధిష్టానం..

వివరాలు 02లో..



## శాంతి స్వరూప్ కన్నుమూత

- తొలి తెలుగు న్యూస్ రీడర్‌గా ప్రఖ్యాతి
- సీఎం రేవంత్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం


2



## కవితను ప్రశ్నించేందుకు సీబీఐకి అనుమతి

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-ఏప్రిల్5:**

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితకు వరుసగా చిక్కులు తప్పడం లేదు. మనీ లాండరింగ్ చేశారంటూ ఈడీ అరెస్టు చేసి జైల్లో పెట్టింది. ఇప్పుడై జైల్లో ఉన్న కవితను ప్రశ్నిస్తామంటూ సీబీఐ రంగంలోకి వచ్చింది. తమకు అనుమతి కావాలని ఢిల్లీ కోర్టులో పిటిషన్ వేసింది. పిటిషన్ ను విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు అనుమతి ఇచ్చింది. ఇంటరాగేట్ చేయడానికి లేదా స్టేట్ మెంట్ రికార్డు చేయడానికి అనుమతి కావాలని సీబీఐ ఆ పిటిషన్‌లో పేర్కొంది.




## కాంగ్రెస్‌కు నమ్మి ఓటేస్తే..
# నట్టేట ముంచారు

### మళ్లీ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మేలా లేరు: హరీశ్ రావు



**నేటి ఫోకస్ న్యూస్, మెదక్-ఏప్రిల్5:**

**తెలంగాణ ప్రజల** పరిస్థితి అన్న వస్త్రాల కోసం పోతే.. ఉన్న వస్త్రాలు పోయినట్లయ్యిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మెదక్ పార్లమెంట్ బీఆర్ ఎస్ అభ్యర్థి అభ్యర్థికి మద్దతుగా మెదక్ నియోజకవర్గం పాపన్నపేట లో బీఆర్ఎస్ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హామీలు నమ్మి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేశార న్నారు. ఒకసారి మోసపోయారు.. మళ్లీమళ్లీ మోసపోతారా అని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపించు కుందామని పిలుపునిచ్చారు. నమ్మి ఓటేస్తే కాంగ్రెస్ వాళ్లు నట్టేట ముంచార న్నారు. డిసెంబర్ 9న రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామన్నారు.. ఇప్పటికీ దిక్కులేదని, అప్పు కట్టాలని రైతులకు బ్యాంకులు నోటీసులు ఇస్తున్నాయని గుర్తు చేశారు. రూ.2 లక్షలు రుణమాఫీ కానివాళ్లు బీఆర్ ఎస్‌కు ఓటెయ్యాలని కోరారు. ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని మిగతా 2లో..



## ద్రవ్య పరపతి విధానం యధాతథం

- రెపో రేటును 6.5 శాతంగా కొనసాగింపు
- ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ వెల్లడి

**నేటి ఫోకస్ న్యూస్, ముంబై-ఏప్రిల్5:**

**భారతీయ రిజర్వ్ బ్యాంకు** కీలక వడ్డీ రేట్లను ప్రకటించింది. ఏడవసారి కూడా రెపో రేటును మార్చలేదు. రెపో రేటును 6.5 శాతంగా కొనసాగిస్తున్న ట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ తెలిపారు. రెపో రేటు యథాతథంగా ఉంచేందుకు ద్రవ్య పరపతి కమిటీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఆర్థికవృద్ధి గాడిలో మిగతా 2లో..



నేటి ఫోకస్ న్యూస్



# శాంతి స్వరూప్ కన్నుమూత

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్5:

తొలి తెలుగు న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ ఇక లేరు. హైదరాబాద్ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజుల క్రితం శాంతిస్వరూప్ గుండెపోటుతో యశోదా ఆస్పత్రిలో చేరారు. శాంతిస్వరూప్ మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 1983 నవంబర్ 14న దూరదర్శన్ చానెల్‌లో శాంతి స్వరూప్ తెలుగులో తొలిసారి వార్తలు చదివారు. పదేండ్ల పాటు టెలీప్రాంప్టర్ లేకుండా పేపర్ చూసి వార్తలు ప్రజలకు వినిపించారు. తొలి తెలుగు న్యూస్ రీడర్‌గా చెరగని ముద్ర వేశారు. 2011లో పదవీ విరమణ చేసే వరకు శాంతి స్వరూప్ వార్తలు చదివారు. లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును కూడా ఆయన అందుకున్నారు. శాంతిస్వరూప్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తొలి తరం న్యూస్ రీడర్‌గా తెలుగు ప్రజలు అందరికీ సుపరిచితులైన శాంతి స్వరూప్ మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. 1983 నుంచి న్యూస్ రీడర్‌గా శాంతి స్వరూప్ తనదైన ముద్ర వేసుకున్నారని రేవంత్ కొనియాడారు. సుదీర్ఘ కాలం పాటు దూరదర్శన్ ద్వారా ఆయన అందించిన సేవలు తెలుగు రాష్ట్రాల ప్రజలకు చిరస్మరణీయం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి అని రేవంత్ పేర్కొన్నారు. దూరదర్శన్ న్యూస్ రీడర్ శాంతిస్వరూప్ మృతిపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. టీవీలో వార్తలను చదివే తొలితరం న్యూస్ రీడర్‌గా శాంతి స్వరూప్ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు పొందారని కేసీఆర్ తెలిపారు. మీడియా రంగంలో ఆయన తనదైన ముద్ర వేశారని గుర్తు చేశారు. శాంతిస్వరూప్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# నమ్మి ఓటేస్తే నట్టేట ముంచారు

(మొదటి పేజీ తరువాయి..)

ఇవ్వలేదని, పక్కపార్టీ వాళ్ల ఇండ్ల చుట్టు రేవంత్‌రెడ్డి తిరుగుతున్నడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి రైతులను గాలికి వదిలేసిండని.. వందరోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో చురుకు పెడితేనే కాంగ్రెస్ దారికొస్తుంద న్నారు. మేం రైతుబంధు ఇస్తామంటే ఎన్నికల కమిషన్‌కు కంప్లయింట్ చేసి ఆపిందని.. రైతుబంధు దుక్కికో.. నాటుకో ఉపయోగపడే డబ్బులు పంట కోతకొచ్చినా రైతుబంధు రాలేదన్నారు. రైతుబంధు కోసం మేం ఉంచిన డబ్బులు కాంగ్రెస్ కాంట్రాక్టర్లకు ఇచ్చిందని.. కాంగ్రెస్ పాలనలో కరెంటు మోటర్లు కాలిపోతున్నాయని తెలిపారు. రైతు భరోసా రూ.15వేలు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎప్పుడంటే అప్పుడు నీళ్లిచ్చామని.. రెండు పంటలు పండించుకునేలా కేసీఆర్ నీళ్లిచ్చా రన్నారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో 200 మంది రైతుల ఆత్మహత్య చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో నీళ్లు తగ్గి కన్నీళ్లు పెరిగినయ న్నారు. రూ.4వేలు పెన్షన్ ఇచ్చే వరకు రేవంత్‌కు అవ్వాతాతల కాళ్లు వత్తాలన్నారు. జనవరి నెల పెన్షన్ రేవంత్ సర్కారు ఎగ్గొట్టిందని.. అన్న వస్త్రాల కోసం పోతే.. ఉన్న వస్త్రాలు పోయినట్లయ్యిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని.. కాంగ్రెస్‌కు ఓటేస్తే వాళ్ల అబద్దాల ను ఆమోదించినట్లేనన్నారు. ఆడబిడ్డల ఖాతాల్లో ప్రతినెలా రూ.2500 వేస్తామని రేవంత్ మోసం చేశారని.. కాంగ్రెస్‌ను ఓడిస్తేనే హామీలు అమలు చేస్తారని చెప్పారు. కల్యాణలక్ష్మి లక్షకు తోడు తులం బంగారం ఇస్తానని, నిరుద్యోగ యువతకు నెలకు రూ.4వేలు ఇస్తామని రేవంత్ మోసం చేశారన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పలేదని అసెంబ్లీలో మంత్రి భట్టి అబద్దాలాడరన్నారు. కేసీఆర్ ఇచ్చిన 30వేల ఉద్యోగాలకు రేవంత్ నియామకపత్రాలు ఇచ్చారన్నారు. చదువుకునే అమ్మాయిలకు ఎలక్ట్రిక్ స్కూటీ ఇస్తామని మోసం చేశారని.. ఇన్ని మోసాలు చూసినంక కాంగ్రెస్‌కు ఎవరైనా ఓటేస్తారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతిహామీ నెరవేర్చే వరకు వెంటాడుతామన్నారు. దుబ్బాక ప్రజలను బీజేపీ రఘునందన్‌రావు మోసం చేశారన్నారు. రఘునందన్‌రావుని దుబ్బాక ప్రజలు బండకేసి కొట్టారన్నారు. పదేళ్లలో సామాన్యులకు బీజేపీ చేసిందేమీ లేదన్నారు. బీజేపీ పాలనలో పెట్రోల్, డీజిల్, అన్నిరకాల వస్తువుల ధరలు పెరిగాయని.. రాముడి పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# ద్రవ్య పరపతి విధానం యధాతథం

(మొదటి పేజీ తరువాయి..)

పడిందన్నారు. అన్ని అంచనాలను దాటి వేస్తున్నామన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ద్రవ్యోల్బణం 5.1 శాతంగా ఉందన్నారు. డిసెంబర్ 5.7 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం రెండు నెలల్లోనే 5.1 శాతానికి తగ్గినట్లు ఆయన చెప్పారు. ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి తీసుకువచ్చే ప్రక్రియలు కొన సాగుతున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ తెలిపారు. జీడీపీ అంచనాల గురించి కూడా శక్తికాంత్ దాస్ కీలక ప్రకటన చేశారు. 2024-25 సంవత్సరానికి చెందిన జీడీపీ వృద్ధి రేటు 7 శాతంగా ఉంటుందని ఆయన అంచనా వేశారు. రిస్కలన్నీ ప్రస్తుతం సమతుల్యంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇకపోతే ప్రభుత్వ బాండ్లు లేదా సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్ట డం మరింత సులువు కానుంది. రిటైల్ ఇన్వెస్టర్ల కోసం కొత్తగా ఓ మొబైల్ యాప్ అందుబాటులోకి రాబోతోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా త్వరలో దీన్ని తీసుకురాబోతోంది. ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడుల కోసం ఆర్‌బీఐ రిటైల్ డైరెక్ట్ స్కీమ్‌ను 2021 నవంబర్‌లో ప్రారంభించింది. ఆర్‌బీఐ డైరెక్ట్ పోర్టల్ ద్వారా ప్రస్తుతం ప్రైమరీ, సెకండరీ మార్కెట్ ప్రభుత్వ సెక్యూరిటీల్లో మదుపు చేయొచ్చు. రిటైల్ ఇన్వెస్టర్లు వేలంలో ఈ సెక్యూరిటీలను అమ్మడం/కొనడం చేయొచ్చు. ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులను మరింత సులభతరం చేయాలన్న ఉద్దేశంలో రిటైల్ డైరెక్ట్ పోర్టల్‌కు సంబంధించిన మొబైల్ అప్లికేషన్‌ను తీసుకురానున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. పరపతి విధాన నిర్ణయాల వెల్లడి సందర్భంగా ఈ విషయాన్ని తెలియజేశారు. యాప్ సిద్ధమవుతోందని, త్వరలోనే అందుబాటులోకి రానుందని చెప్పారు. ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ నుంచి రూ.14.13 లక్షల కోట్లు సమీ కరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో తొలి అర్ధభాగంలోనే రూ.7. 5 లక్షల కోట్లు సేకరించాలనుకుంటోంది. మరోవైపు సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ వినియోగాన్ని మరింత విస్తృత పరచాలన్న ఉద్దేశంతో ఆర్‌బీ ఐ మరో నిర్ణయం తీసుకుంది. నాన్ బ్యాంక్ పేమెంట్ సిస్టమ్ ఆపరేటర్లూ డిజిటల్ కరెన్సీ వాలెట్‌ను అందించే సదుపాయం తీసుకొస్తోంది. ప్రస్తుతం రిటైల్, హోల్‌సేల్ విభాగంలో బ్యాంకులు పైలట్ ప్రాజెక్టుగా ఈ సేవలను అందిస్తున్నాయి. సీబీడీసీ- రిటైల్ వినియోగాన్ని మరింత పెంచాలన్న ఉద్దేశంతో నాన్ బ్యాంక్ పేమెంట్ సిస్టమ్ ఆపరేటర్లు కూడా సీబీడీసీ వాలె ట్లను అందించనున్నాయని శక్తికాంత దాస్ తెలిపారు. ఇందుకు అవసర మైన మార్పులు చేయబోతున్నట్లు చెప్పారు. భారతదేశ విదేశీ మారక నిల్వలు రికార్డు స్థాయిలో 645.6 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి, 29 మార్చిన ఈ రికార్డ్ సాధ్యమైంది. కొంతకాలం క్రితం, మన దేశంలోని విదేశీ మారక ద్రవ్య నిల్వల గురించి ఆందోళనలు ఉన్నాయి. అయితే ఆర్‌బీఐ ఈ సమస్యపై నిశితంగా దృష్టి పెట్టి పరిష్కరించింది. కేంద్ర బ్యాంక్‌పై ఉన్న విశ్వాసాన్ని కొనసాగించింది.

# నేడు జనజాతర

(మొదటి పేజీ తరువాయి..)

తదితరులు 250 మంది వరకు ఆసీనులయ్యేలా భారీ వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన వేదిక సహా లైటింగ్, సౌండ్ సిస్టం ఏర్పాటు, కుర్చీలు, గ్యాలరీల ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. సాయంత్రం ఐదు గంటలకు ఏఐసీసీ ముఖ్య నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ముఖ్య నేతలు హాజరై.. కాంగ్రెస్ జాతీయ గ్యారంటీలను ప్రకటించనున్నారు.

రాష్ట్రం నలుమూలల నుంచి 10 లక్షలకు పైగా జనాన్ని సమీకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జన సమీకరణ బాధ్యతను పార్టీ అభ్యర్థులతోపాటు మంత్రులపైనా టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెట్టారు. ప్రతి నియోజకవర్గం నుంచి 50 వేలకు తగ్గకుండా జనాన్ని సమీకరించాలని, మిగిలిన నియోజకవర్గాల్లో బూత్‌కు ఒక వాహనం బయలు దేరాలని, ఒక్కో వాహనంలో పది మందికి తక్కువ కాకుండా చూసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సీఎం సూచన మేరకు పార్టీ అభ్యర్థులు, మంత్రులు జన సమీకరణకు భారీగా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా తుక్కుగూడ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఎనిమిది లోక్‌సభ నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున జనాన్ని సమీకరిస్తున్నా రు. అయితే సభకు వస్తున్న వారిలో మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేలా చూస్తున్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలకుగాను ప్రభుత్వం ఇప్పటికి అమలు చేసిన ఐదు గ్యారెంటీల లబ్ధిదారుల్లో మహిళలే అధికం కావడంతో.. సభలో వారి భాగస్వామ్యం ఎక్కువ ఉండేలా చూస్తున్నారు.

**భారీ ఏర్పాట్లు.. :** జనజాతర సభకు 10 లక్షల మందిని సమీకరించేందుకు ఏర్పాట్లు చేసిన కాంగ్రెస్ పార్టీ.. అంతమంది ఈ ఎండలకు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లూ చేసింది. 70 ఎకరాల విస్తీర్ణంలో సభను నిర్వహించనుండగా.. ఆ పక్కనే ఉన్న 550 ఎకరాలను వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. సభావేదికపై 250 మంది ముఖ్యనేతలు కూర్చొనే విధంగా భారీ వేదికను నిర్మించారు. వేదిక కుడివైపు 250 మంది రాష్ట్ర ముఖ్యనేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూర్చునేందుకు సీట్లు వేశారు. వేదిక ఎడమవైపు కళాకారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేదిక వెనుక భారీ స్క్రీన్ ఏర్పాటు చేయడంతో పాటు సభ ప్రాంగణంలో జనాలకు కనిపించేలా నలుమూలలా స్క్రీన్లు ఏర్పాటు చేశారు. కాగా, ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో సభకు హాజరయ్యే వారికి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాయంత్రం 5గంటలకు నిర్వహిస్తున్న సభకు రాష్ట్ర నలుమూల నుంచి హాజరవుతున్న వారికి తాగునీరు ఏర్పాటు చేస్తున్నారు. సభ ప్రాంగణంలో 24 లక్షల వాటర్ బాటిళ్లు అందుబాటులో ఉంచడంతోపాటు 12 లక్షల మజ్జిగ ప్యాకెట్లు పంపిణీకి సిద్ధం చేశారు. సభకు వస్తున్నవారికి మార్గమధ్యంలో భోజన సదుపాయం కల్పించే బాధ్యతను స్థానిక నాయకత్వానికి అప్పగించారు. సభా ప్రాంగణం వద్ద అత్యవసర వైద్యసేవలు కూడా అందుబాటులో ఉంచారు.

# పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారెంటీ

- రైతు, యువత, మహిళలకు న్యాయం..
- అభివృద్ధిలో భాగస్వామ్యం..
- సెంట్రల్ మేనిఫెస్టో విడుదల చేసిన కాంగ్రెస్ అధిష్టానం..

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-ఏప్రిల్5:




ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజాకర్షక మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వచ్చింది. అన్ని వర్గాలను అక్కున చేర్చుకుని ముందుకు సాగే లక్ష్యంతో ఆకర్శణీయమైన, ఆచరణసాధ్యమైన హామీలను పొందుపర్చిన మేనిఫెస్టోను ప్రకటించింది. ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. 48 పేజీలతో కూడిన మ్యానిఫెస్టోను పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో కలిసి విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న రైతాంగానికి అవసరమయ్యే విధంగా పంటకు కనీస మద్దతు ధర నిర్ణయించి దానికి చట్ట భద్రత కల్పిస్తామని ఖర్గే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోని విడుదల చేసింది. ఎన్నో రోజులుగా ఊరిస్తూ వచ్చిన పార్టీ మొత్తానికి హామీల ను ప్రకటించింది. పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారెంటీ పేరుతో ఈ మేనిఫెస్టోని విడుదల చేసింది. మొత్తం 25 హామీలు వెల్లడించింది. సామాజిక సంక్షేమ పథకాలతో పాటు 25 గ్యారెంటీలు చేర్చింది. దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా 8 కోట్ల కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులు పంపిణీ చేస్తామని వెల్లడించింది. రిజర్వేషన్‌లపై ప్రస్తుతం ఉన్న 50శాతం పరిమితిని తొలగిస్తామని హామీ ఇచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తామని తెలిపింది. వ్యవసాయ పరికరాలకు జీఎస్‌టీ మినహాయింపు ఇస్తామని హామీ ఇచ్చింది. రైల్వేల ప్రైవేటీకరణను నిలిపివేస్తామని స్పష్టం చేసింది. యువతకు 30 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడించింది. అగ్నివీర్ స్కీమ్‌ని రద్దు చేస్తామని తెలిపింది. మహాలక్ష్మి పథకం ద్వారా పేద కుటుంబానికి ఏడాదికి రూ.లక్ష నగదు అందిస్తామని హామీ ఇచ్చింది. కనీస మద్దతు ధరకు లీగల్ గ్యారెంటీ కూడా ఈ హామీల జాబితాలో ఉంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని మరో ఆసక్తికర హామీని చేర్చింది. యువకులు, మహిళలతో పాటు రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఈ మేనిఫెస్టోని రూపొందించింది కాంగ్రెస్. అన్ని వర్గాలకూ సమన్యాయం జరిగేలా చూస్తామన్న సంకేతమిచ్చేలా పాంచ్ న్యాయ్ పేరిట ఈ హామీలను తయారు చేసింది. యువ న్యాయ్, నారీ న్యాయ్, కిసాన్ న్యాయ్, శ్రామిక్ న్యాయ్, హిస్సేదారి న్యాయ్ పేరిట వీటిని ప్రకటించింది. దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ డేటా ఆధారంగా ఆయా వర్గాల సంక్షేమానికి సహకరిస్తామని వెల్లడించింది. రిజర్వేషన్‌లపై ఇప్పటి వరకూ ఉన్న 50 శాతం పరిమితి తొలగిస్తామని స్పష్టం చేసింది. దీంతో షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాలకు మేలు జరుగుతుందని వివరించింది. కుల గణన తరవాత ఈ 50 శాతం పరిమితిని తొలగించేలా రాజ్యాంగంలో సవరణలు చేస్తామని తెలిపింది. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకి చెందిన వాళ్లకి విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో 10శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని వెల్లడించింది. . ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్ ఉద్యోగాల్ని రెగ్యులరైజ్ చేయడాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ వెల్లడించింది. ఎలక్టోరల్ బాండ్స్‌పై విచారణతో పాటు పెగాసస్, రఫేల్ అంశాలపైనా పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని హామీ ఇచ్చింది. అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని స్పష్టం చేసింది. పాతపద్ధతిలోనే ఆర్మీ రిక్రూట్‌మెంట్ చేస్తామని వెల్లడించింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు వ్యవసాయ పరికరాలపై జీఎస్‌టీని మినహాయిస్తామని హామీ ఇచ్చింది. దేశవ్యాప్తంగా రైతు రుణమాఫీ చేస్తామని వెల్లడించారు. వ్యవసాయ పరికరాలకు జీఎస్టీ రద్దు చేస్తామని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద రోజుకు రూ. 4 వందలు ఇస్తామని హామీ ఇచ్చారు. మ్యానిఫెస్టోలో సామాజిక సంక్షేమ పథకాలతో పాటు 25 గ్యారెంటీలను పొందుపరిచారు. ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి, సంక్షేమ సూత్రాలపై దీనిని రూపొందించినట్లు మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ చిదంబరం వివరించారు. గత పదేళ్లుగా ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని, అన్నిరంగాల్లో విధ్వంసం జరిగిందని ఆయన అన్నారు. అధికారంలోకి రాగానే పేదల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు ఖర్గే మాట్లాడారు. మా మేనిఫెస్టోను పేదలకు అంకితం చేస్తున్నాం. దేశ రాజకీయ చరిత్రలో న్యాయ పత్రాలుగా దీనిని ప్రజలు గుర్తుంచుకుంటారు. రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో అందిస్తామన్న ఐదు న్యాయాలు, 25 గ్యారంటీలు దీనిలో ఉన్నాయి. 'యువ న్యాయ్' కింద ప్రతి విద్యావంతుడికి అప్రంటీస్‌గా పనిచేసే అవకాశం కల్పిస్తాం. దీని కోసం ఒక్కొక్కరిపై రూ.లక్ష వెచ్చిస్తాం. 'మహిళా న్యాయ్' కింద పేద ఇంటి ఆడవారికి ఏటా రూ.లక్ష సాయం చేస్తాం. 'కిసాన్ న్యాయ్' కింద రైతులకు రుణమాఫీ, ఎంఎస్‌పీ చట్టాలకు హామీ ఇస్తున్నాం.

# ప్రభుత్వ అసమర్థతో సంక్షోభంలో వ్యవసాయరంగం



(మొదటి పేజీ తరువాయి..)

ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాజ్యంలో ఉన్నది అసమర్థులు, చవట దద్దమ్మలని విమర్శించారు. రైతుబంధు ఇవ్వకుండా రైతులను అగమాగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మహాలక్ష్మి లేదు.. మన్ను లక్ష్మి లేదు అంతా మోసమని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం తప్పిదాల వల్ల 209 మంది రైతులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన రైతులకు రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పండిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇక నీ డ్రామాలు నడవవని హెచ్చరించారు. కేఆర్‌ఎంబీ అధికారులు ఏమైనా తమకు బాసులా అని ప్రశ్నించారు. 'ముఖ్యమంత్రి నేనా.. నువ్వా.. నేను వెళ్లగానే..మోటార్లు ఆన్ చేశారు' అని చెప్పారు. రూ. 2 లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. డిసెంబర్ 9వ తేదీన మాఫీపై చేసిన సంతకం ఏమైందని నిలదీశారు. కరీంనగర్‌లో మేం జలధారలు సృష్టించి ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించామని.. ఇప్పుడు కేవలం నాలుగైదు నెలల్లోనే ఆ జలధారలు ఎందుకు ఎడారులుగా మారినయని కేసీఆర్ ప్రశ్నించారు.అంతకు ముందు ఆయన బాబూజగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు. కాళేశ్వరం పూర్తయినందున ఈ జిల్లాలో ఇక నీళ్లకు డోకా ఉండదు, జిల్లాలో నాలుగు సజీవ జలధారలు అమృత ధారలుగా ఉంటయి, నిరంతరం ఈ జిల్లాను కాపాడుతయని చెప్పిన. ఆ సజీవ జలధారలను మేం సృష్టించినం. జిల్లా ప్రజలు వాటి ఫలితాలను అనుభవించిండ్రు' అని కేసీఆర్ తెలిపారు. గోదావరి మీద నర్మించిన బ్యారేజీలు, అసంపూర్తిగా ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తికావడం, ఎస్సారెస్పీకి నీళ్లు తక్కువైతే కాళేశ్వరం నుంచి నింపుకునే విధంగా పునరుజ్జీవం రావడంతో గోదావరి నది 200 కిలోమీటర్లపాటు నిండు జలాలతో ఉండేది. గత ఐదారేళ్లు ప్రజలు వాటిని ఎలా అనుభవించిండ్రో యావత్ ప్రజానీకానికి తెలుసు' అని కేసీఆర్ అన్నారు. 'ఇన్ని జలధారలు సృష్టించి, నాలుగైదేండ్లు చక్కటి ఫలితాలు లభించి, లక్షల టన్నుల ధాన్యం పండించి, ఎంత కావాలంటే అంత తాగునీరు అనుభవించిన కరీంనగర్

ప్రజలు నాలుగైదు నెలల్లోనే ఏం జరుగుతున్నదో చూస్తున్నరు. ఈ జలధారలు ఎడారులుగా మారిపోయినయ్. నిండు జలాలతో కళకళలాడిన రాష్ట్రంలో ఎందుకు ఈ పరిస్థితులు వచ్చినయ్..? ప్రస్తుతం ప్రభుత్వం తెలివి తక్కువ, అసమర్థ, అవివేక, చవట విధానాలవల్ల, అర్భకత్వం వల్ల ఈ దరిద్రం వచ్చింది. 2014కు ముందు తెలంగాణలో ఏ గోస ఏ ఏడుపు ఏ బాధ, ఏ మంచి నీళ్ల ట్యాంకర్‌లు, ఏ బిందెల కొట్లాటలు, ఏ కాలిపోయిన మోటర్లు కనబడుతుండెనో ఇప్పుడు అదే పరిస్థితి కనబడుతున్నది' అని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో లత్కోర్‌లు రాజ్యం ఏలుతున్నారని ధ్వజమెత్తారు. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువేనని అన్నారు. 15 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై కేసీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఆయనను తన ప్రభుత్వంలో జైల్లో పెట్టాలనుకుంటే పెట్టేవాళ్లమని హెచ్చరించారు. మిడ్ మానేరు కట్ట కొట్టుకుపోవడానికి కోమటిరెడ్డి కంపెనీయే కారణం కాదా అని ప్రశ్నించారు. ఇవాళ ఆ మంత్రి అడ్డం పొడవు మాట్లాడుతున్నారని కేసీఆర్ విరుచుకుపడ్డారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కేసీఆర్ మండిపడ్డారు. రైతులు బ్యాంకులకు ఉరుకుండ్రి.. డిసెంబర్ 9 నాడు సంతకం చేస్తా.. 2 లక్షల రుణమాఫీ చేస్తా.. అని రేవంత్ రెడ్డి చెప్పిండు అని కేసీఆర్ గుర్తు చేశారు. ఆ హామీ ఎక్కడికిపోయిందని.. డిసెంబర్ 9న వెళ్లి ఎన్ని రోజులు అయ్యిందని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతుందని.. ఇంకా దాని మీద ఊసే లేనట్టు ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు.మీ పాగల్ పని వల్ల తెలంగాణ రాష్ట్ర వ్యవసాయమే సంక్షోభానికి గురయ్యే పరిస్థితి వచ్చిందని.. అయినా కూడా రైతు రుణమాఫీ మీద ఉలుకు పలుకు లేదని మండిపడ్డారు. వర్షాకాలం వడ్లు వస్తే దానికి బోనస్ ఇవ్వలేదు. క్వింటాల్‌కు 500 ఇస్తామని చెప్పి ఇయ్యలే. ఇవాళ కొనుగోలు కేంద్రాలు పెట్టినమని చెప్పిండ్రు.. కానీ బోనస్ ఇస్తారా? లేదా? అనేదాని మీద ఉలుకులేదు.. పలుకు లేదు. ఇవ్వకపోతే మిమ్మల్ని వెంటాడుతాం అని హెచ్చరించారు.

ఇదే రిఫరెండం అనుకుని ఓటేయమని మీరే చెప్పిండ్రు కదా.. మీ సంగతేంటో ప్రజలు చూపిస్తారు. బోనస్ ఇవ్వకపోతే.. బోగస్ అని మీకు ఎలా బుద్ధి చెప్పాలో అలా బుద్ధి చెబుతారు. కర్రు కాల్చి వాత పెడతరు.' అని కేసీఆర్ హెచ్చరించారు. బోనస్‌కు ఎలక్షన్ కోడ్ అడ్డురాదని చెప్పారు. రైతులు ఉద్యమానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కల్యాణలక్ష్మికి తులం బంగారం కలిపి ఇస్తామని చెప్పిండ్రు.. మార్కెట్‌లో ముఖ్యమంత్రికి, మంత్రులకు తులం బంగారం కొందామంటే దొరకట్లేదా? అని ప్రశ్నించారు. గొర్రెల యూనిట్లు ఇస్తారనే ఆశతో యాదవ సోదరులు వందల కోట్లు కట్టి ఉన్నారు.. కానీ గొర్రెల యూనిట్లు బంద్ చేసిండ్రు. దానిపై మిమ్మల్ని శిక్షించేందుకు యాదవ సోదరులు రెడీగా ఉన్నారని కేసీఆర్ అన్నారు. ' మేం 1.30 లక్షల మందికి దళితబంధు మంజూరు చేశాం. మేం 10 లక్షలు ఇచ్చేవాళ్లం.. మీరు 12 లక్షలు ఇస్తామని అన్నారు. దాని మీద కూడా ఉలుకులేదు పలుకు లేదు. మేం రిలీజ్ చేసిన డబ్బు కూడా ఫ్రీజ్ చేశారు. అని పేర్కొన్నారు. ఇటువంటి మొద్దు నిద్రపోయే సర్కార్‌కు బరతలు పెట్టుకుని వాయించుడే కరెక్ట్ అని దళిత సోదరులకు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారాలకు వచ్చే వీళ్లను నిలదీయాలని పిలుపునిచ్చారు. అన్న వస్త్రాం ఇస్తారని వెళ్తే.. ఉన్న వస్త్రం ఉడుచుకుపోయిందన్నట్టుగా రాష్ట్రంలో పరిస్థితి మారిందన్నారు. 12 లక్షలు ఇస్తారని మీకు ఓటేస్తే.. పాత 10 లక్షలు మంజూరు చేసుడు లేదు.. కొత్త దానిపై ఊసే లేదని మండిపడ్డారు. దళిత పులులు ఎక్కడికక్కడ గర్జించాలి.. కాంగ్రెస్ పార్టీని నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో దాదాపు 30 లక్షల పింఛన్లు ఉన్నాయి. మేం 2 వేలు ఇస్తే.. మీరు నాలుగు వేలు ఇస్తామని మాట ఇచ్చిండ్రు. అంటే ఇంట్లో ముసలమ్మ ముసలయ్య ఉంటే ఇద్దరికీ ఇస్తామని చెప్పిండ్రు.

వాళ్లు ఇంకో 30 లక్షల మంది ఉన్నారు. అంటే మీరు ఎంతమందికి ఎగనామం పెట్టిండ్రు. ఒక నెల అయితే 2వేల పింఛన్లు ఇవ్వలేదు. ఇప్పుడు నాలుగు వేలు లేవు.. మన్ను లేవు.. ఇంకా సిగ్గులేకుండా మీ పాలనను రిఫరెండం అని చెబుతారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గలీజ్‌గా మాట్లాడుతున్నాడరని కేసీఆర్ మండి పడ్డారు. ఓ ముఖ్యమంత్రి స్థాయిలో వంద రోజుల్లో 200 మంది రైతులు చనిపోయారని నేను చెబితే.. 48గంటల్లో వివరాలు ఇవ్వండి.. నష్టపరిహారం ఇస్తామన్నారు. కానీ, మేం నాలుగు గంటల్లోనే లిస్టను సీఎస్‌కు పంపినం. 209 మంది జాబితా పంపినం. దాని తర్వాత ఐదు, పది జరిగినయ్. ఇప్పటి వరకు ఉలుకూ లేదు పలుకూ లేదు. మీ అసమర్థత వల్ల చనిపోయారు కాబట్టి.. తలా రూ.25లక్షల వెంటనే రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించి.. పరామర్శించాలి. మీకు ఉసురు, పాపం తగులుతుంది. మిమ్మల్ని వదిలిపెట్టమని చెబుతున్నా. పంట కోసం పెట్టుబడి పోయింది. వస్తదనుకున్న పంట పోయింది' అన్నారు. తప్పించుకుందా మనుకుంటే.. మీ వీపులు విమానం మోత మోగిస్తరు ప్రజలు. మిమ్మల్ని వదిలిపెట్టరు. మీ డ్రామాలు వడవవు. మొన్న సూర్యాపేటలో చెప్పిన. నాలుగు మాసాల వరకు నోరు తెరువలేదు. టైమ్ ఇవ్వాలి కొత్త ప్రభుత్వానికి అని మాట్లాడలేదు. వాళ్లు ఎన్ని పిచ్చిపిచ్చి ఆరోపణలు.. పీఆర్ స్టంట్స్.. తొత్తులుగా ఉన్న మీడియాతో అడ్డగోలుగా వార్తలు రాయించి.. ఏం చెప్పినా మేం మాట్లాడలేదు. గంభీరంగా ఉన్నాం. పరిస్థితిని గమనించుకుంటూ ఉన్నాం. మంచిచెడ్డ ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతో ఉన్నాం. మేం చెప్పేది ఎండిపోయిన పంటల గురించి. వట్టిగా తమాషకు చెప్పడం లేదు. రైతులే ఫొటోలు ఇచ్చారు. పంటలు భయంకరంగా ఎండిపోయాయి. నేను సూర్యాపేట జిల్లాకు వెళ్తే. అక్కడ జిల్లాకు నీళ్లు కాల్వల్లోకి నీరు వచ్చాయి. తెల్లారే ఫోన్లు వచ్చాయి. మీ బస్‌పోంగనే నీళ్లు వాపస్ పోయినయని. సాగర్‌లో డెడ్‌స్టోరీ మీద 14 టీఎంసీలు ఉన్నయ్. ఎందుకు వాడుతలేరు ? మొత్తం కూలిపోయిందని చెప్పిన కాళేశ్వరం పంపులు ఆన్ చేసి వరద కాలువలోకి నీళ్లు వదులుతరు' అన్నారు. సిగ్గులేకుండా ముఖ్యమంత్రి మాట్లాడుతున్నడు. కేసీఆర్ గారు ముందే చెప్పచ్చుగదా నీళ్లు వదలాలని.. ముఖ్యమంత్రివి నువ్వా? నేనా? నీ ఇంజినీర్లు ఏం చేస్తున్నరు నీ డిపార్ట్‌మెంట్ ఏం చేస్తుంది.. . ఎందుకు వేల ఎకరాల్లో పంటలు ఎండపెట్టారు ? నాగార్జున సాగర్ కాలువ కొద్దిరోజుల ద్వారా కొద్దిరోజుల ముందు ఇచ్చి ఉంటే.. వేల ఎకరాలు ఒక తడికోసం ఎదురుచూసే పంట బతికేది. వరద కాలువ కింద కూడా 20 రోజుల కిందట వదిలి ఉంటే.. ప్రతి గ్రామంలో వందల ఎకరాల్లో పంట దక్కేది. ఈ పరిస్థితి సమయానికి నీళ్లు వదలక.. ఉన్న వనరులు, వసతులు తెలివితో వాడుకోక.. క్వాలిటీ కరెంటు అందించక.. రైతుబంధు సమయానికి ఇవ్వక.. ప్రజలను వెర్రితిర్రి మాటలతో ప్రజలను గందరగోళానికి గురి చేశారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో వినోద్ కుమార్, గంగుల కమలాకర్, కెటిఆర్, దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలో

# పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

**అచ్చంపేట, (నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి)-ఆర్.భరత్ ఏప్రిల్ 05:**

అణగారిన వర్గాల అభ్యుదయానికి కృషిచేసిన భారత అమూల్య రత్న, భారతదేశ మాజీ ఉప ప్రధాని శ్రీ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి తన స్వగృహమునందు శ్రీ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన శ్రీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ 1946లో అతను జవహర్‌లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో అతి పిన్న వయస్కుడైన మంత్రిగా బాధ్యతలు చేపట్టాడు భారతదేశపు మొట్టమొదటి క్యాబినెట్ కార్మిక మంత్రిగా భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుడు ఉంటూ బాబు జగ్జీవన్ రావు సామాజిక న్యాయం రాజ్యాంగంలో పొందుపరచబడిందని నిర్ధారించాడు.అతను భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడిగా నలభై సంవత్సరాలకు పైగా వివిధ శాఖల క్యాబినెట్ మంత్రిగా పనిచేశాడు.మరీ ముఖ్యంగా అతను 1971 ఇండో-పాక్ యుద్ధం జరిగిన సమయంలో భారత రక్షణ మంత్రిగా ఉన్నాడు, ఫలితంగా బంగ్లాదేశ్ ఏర్పాటుకు సుగమం ఏర్పడింది. భారతదేశంలో హరిత విప్లవం, భారత వ్యవసాయాన్ని ఆధునీకరించడంలో అతను అందించిన సహకారం, కేంద్ర వ్యవసాయ మంత్రిగా తన రెండు పదవీకాలాల్లో 1974 కరువు సమయంలో, ఆహార సంక్షోభాన్ని నివారించటానికి ప్రత్యేకంగా అదనపు మంత్రిత్వ శాఖను నిర్వహించమని కోరినప్పుడు అంగీకారం తెలుపటం ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన విషయం. భారత అత్యవసర స్థితి సమయంలో (1975-77) ప్రధాని ఇందిరాగాంధీకి మద్దతు ఇచ్చినప్పటికీ, 1977 లో కాంగ్రెస్‌ని విడిచిపెట్టి, జనతా పార్టీ కూటమిలో చేరాడు. తరువాత కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ పార్టీతో పాటు అతను భారత ఉప ప్రధానమంత్రిగా పనిచేశాడు (1977-79). తరువాత 1981లో, అతను భారత జాతీయ కాంగ్రెస్ (జె) ను స్థాపించాడు. బాబు జగ్జీవన్ రావు మరణం తరువాత, అతను స్వతంత్ర భారతదేశం మొట్టమొదటి క్యాబినెట్‌లో చివరిగా జీవించి ఉన్న చివరి తాత్కాలిక మంత్రి, జీవించి ఉన్న చివరి సభ్యుడు అని మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు రాజ్యాంగ పరిరక్షణ మరియు అమలుకు నోచుకునే విధంగా కృషిచేసిన మహాత్ముడు బాబు జగ్జీవన్ రామ్ అని తెలియజేస్తూ బాబు జగ్జీవన్ రామ్ మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను మరియు వారు కన్నా కళలను మనము వారి అడుగుజాడలలో ముందుకెళ్లాలని సూచించడం జరిగినది. అదే విధంగా వారిని స్ఫూర్తిగా తీసుకొని ఉండాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నేత అడ్వకేట్ రాజేందర్ బ్లాక్ కాంగ్రెస్ నాయకులు గోపాల్ రెడ్డి గిరిజన సేవా సంఘం తాలూకా అధ్యక్షులు లచ్చు నాయక్ మస్తాన్, మోపతయ్య, అంతటి మల్లేష్,పాత్కుల శ్రీశైలం, శత్రు నాయక్, రాజగోపాల్,భరత్ కుమార్,బుచ్చి రాములు, సాంబయ్య మరియు కార్యక్రమంలో నిర్వాహకులు కాసిం మహేష్ పాల్గొన్నారు.



## వనపర్తికి నేడు బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలి రాక

- మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధమ్మ

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**



వనపర్తి జిల్లా కేంద్రంలోని లక్ష్మి కృష్ణ గార్డెన్స్ లో నేడు నిర్వహించనున్న మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశానికి భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించిన తరువాత జిల్లా కార్యవర్గ సమావేశానికి మొదటిసారిగా వనపర్తికి డాక్టర్ శిల్పా రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు.ఈ కార్యవర్గ సమావేశానికి బూత్ కమిటీ, మండల, జిల్లా, రాష్ట్ర పార్టీ మోర్చాల బాధ్యులు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఈ సమావేశానికి బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ రాకాసి లోక్నాథ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు సబిరెడ్డి వెంకటరెడ్డి, అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి, బి. శ్రీశైలం, జ్యోతి రమణ, వారణాసి కల్పన తదితరులు పాల్గొననున్నారని పేర్కొన్నారు.

## 7న కవి సమ్మేళనం

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పండగను పురస్కరించుకొని ఈనెల 7న కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఏ. ఓంకార్ లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీవ్ చౌక్ లో గల డాక్టర్ రమేష్ బాబు హాస్పిటల్ పైన అనంతరం ఐదు గంటలకు నిర్వహించే కవి సమ్మేళనానికి కవులు హాజరై నమః కవితా గానాన్ని అందించి సత్కారం పొందాలని కోరారు.



## ప్రతిభ కనబరిచిన జిఎన్ ఆర్ ఆదిత్య స్కూల్ విద్యార్థులు

- అభినందలు తెలిపిన కరస్పాండెంట్ ఏ.హలరాజు

**అచ్చంపేట, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి) -ఆర్.భరత్ ఏప్రిల్ 05:**

సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సర్ సివి రామన్ ఒలంపియాడ్ యంగ్ జీనియస్ 31వ అవార్డుల ప్రధానోత్సవంలో భాగంగా నేడు హైదరాబాద్ లోని శ్రీ సత్య సాయి నిఘమగమం లో తెలుగు ఆస్కార్ అవార్డు గ్రహీత కే సుభాష్ చంద్రబోస్ డిఆర్డిఓ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి మరియు సుచిర్ ఇండియా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ లయన్ వై .కిరణ్ చేతుల మీదుగా ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా వ్యాప్తంగా అచ్చంపేటలోని జిఎన్ఆర్ ఆదిత్య పాఠశాల విద్యార్థులు అయిన ఆరవ తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన కె.నిహారిక నాలుగో తరగతి విభాగంలో వి.అరుణ్ మొదటి ర్యాంకు సాధించి బహుమతులను స్వీకరించారు. ఈ అవార్డ్ గ్రహీతలకు జి ఎన్ ఆర్ ఆదిత్య పాఠశాల అధినేత వై. హాలరాజు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులకు అన్నివేళలా అన్ని విధాలుగా తీర్చిదిద్దుతు వారి యొక్క భవిష్యత్తుకు పునాది వేస్తున్న ఉపాధ్యాయులకు కూడా శు భాకాంక్షలు తెలియపరుస్తూ అదే విధంగా ప్రతి పరీక్ష కార్యక్రమంను దృష్టిలో ఉంచుకొని మెరుగైన విద్యను అందించడమే జిఎన్ఆర్ ఆదిత్య పాఠశాల యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని తెలియజేశారు.

## తుక్కుగూడ కాంగ్రెస్ జనజాతర సభను

# విజయవంతం చేయండి

### డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ



**అచ్చంపేట, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి)-ఆర్.భరత్ ఏప్రిల్ 05**

అచ్చంపేట పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన అచ్చంపేట నియోజకవర్గ ముఖ్య నాయకులు కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న స్థానిక శాసనసభ్యులు డాక్టర్. చిక్కుడు వంశీకృష్ణ ఈనెల 6వ తారీఖున రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ పార్టీ జన జాతర సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సభలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ను ప్రజలకు అందించనున్నారని, ఈ సభకు కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియా గాంధీ, ఖర్గే, రాహుల్ గాంధీ హాజరు అవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాగర్కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల అచ్చంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ రాము యాదవ్ మరియు తిరుపతిరెడ్డి అచ్చంపేట నియోజకవర్గం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నేత అడ్వకేట్ రాజేందర్ వివిధ మండల పార్టీ అధ్యక్షులు వర్కింగ్ ప్రెసిడెంట్లు సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## నయీంనగర్ బ్రిడ్జి కూల్చివేత పనులు ప్రారంభం

- నూతన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు - పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే నాయిని - 3నెలలు ట్రాఫిక్ మళ్లింపు



**హనుమకొండ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 05:** ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచుస్తున్న హనుమకొండలోని నయీం నగర్ ప్రజల కల సాకారంకానున్నది. 50 ఏండ్ల తర్వాత కొత్త వంతెన నిర్మాణం కానుంది. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సమీప ప్రజలు వరద ముంపు నుంచి బయటపడే అవకాశం.ఉంది. నాళాలు ఆక్రమణకు గురి కావడంతో వర్షాకాలంలో వరద భీభత్సంతో రెండు పర్యాయాలు హన్మకొండ నగరం మునిగి పోయింది. దీని వల్ల ప్రజలు ఆర్థికంగా మానసికంగా క్రుంగిపోయారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలు అధికారంలో ఉండి కూడా నయీం నగర్ బ్రిడ్జ్ కు శాశ్వత పరిశ్కారజం చూపలేక పోయారని ఎమ్మెల్యే విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే వర్షాకాలం వరదల సందర్భంగా నాల ఇరువైపులా కాలనీల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్ళగా నిధులు కేటాయించినట్లు అన్నారు. వర్షాకాలం రాక ముందే మూడు నెలల లోపే పనులు పూర్తి చేసేలా అధికారులను చర్యలు తీసుకోవాలన్నారు. నగరం నడిబొడ్డున ఉన్న ఈ బ్రిడ్జి కూల్చివేత వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బంది ఎదురుకానున్నందున పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. బ్రిడ్జి నిర్మాణం కోసం ఇప్పటికే రెండు వైపులా ట్రాఫిక్ ను మళ్లించిన విషయం తెలిసిందే. గత పాలకులు పజలను పట్టించుకోలేదనీ, అభ్భివృద్ధిని విస్మరించారన్నారు. అభివృద్ధి అంటేనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి.. అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## తుక్కుగూడ జన జాతరకు భారీగా తరలిరండి..: మొగిలి సత్యా రెడ్డి



**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:** నేడు తుక్కుగూడ లో జరిగే కాంగ్రెస్ పార్టీ జన జాతర సభకు అలంపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలని అలంపూర్ ఎన్నికల ఇన్చార్జ్ మొగిలి సత్యారెడ్డి, బల్గేర నారాయణరెడ్డిలు అన్నారు. ఏఐసీసీ సెక్రటరీ అలంపూర్ మాజీ శాసనసభ్యులు ఎస్ఏ. సంపత్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం అలంపూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుక్కుగూడలో ఏర్పాటు చేసే జన జాతర సభకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీలు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు వారు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున అధిక సీట్లు సాధించడమే లక్ష్యంగా జన జాతర సభకు సుమారు పది లక్షల మందితో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వడ్డేపల్లి మండల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ వడ్డేపల్లి దేవేంద్ర జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగ శిరోమణి పచ్చర్ల కుమార్ కృష్ణ కాంత్ పైపాడు నాయుడు కొంకల రాజేష్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ అసమర్థ

# అరాచక పాలన

- నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి

**మిర్యాలగూడ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 05:**

మిర్యాలగూడ పట్టణము రెడ్డికాలనీ నందు గల మిర్యాలగూడ నియోజక వర్గ బి.అర్.యస్ పార్టీ కార్యాలయము నందు నిర్వహించిన ప్రెస్ మీట్ లో పాల్గొని ప్రసంగిస్తున్న మాజీ మంత్రి సూర్యాపేట శాసన సభ్యులు శ్రీ. గుంటకండ్ల జగదీష్ రెడ్డి, ప్రెస్ మీట్ లో మాజీ మంత్రి తో మ్మెల్సీ ఎం.సీ కోటి రెడ్డి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, తిప్పన విజయసింహ రెడ్డి గార్లు బి.అర్.యస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న అసమర్థ, అరాచక పాలన గురించి నిప్పులు చెరిగారు. మన జిల్లాకు ఇద్దరు మంత్రులు ఉండి కూడా చుక్క నీరు మనకు రానివ్వకుండా పైకి తరలించుకుపోతుంటే చూస్తూ ఉంటున్నారు తప్ప ఏమి మాట్లాడడం లేదని, దీని మీద పంటకు 500 రూపాయల బోనస్, పంట నష్ట పరిహారం ఏకరాకు 25 వేల రూపాయలు అందించడం మీద రేపు మా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ. కెసిఆర్ పిలుపు మేరకు అన్నీ నియోజక వర్గాలలో నిరసన దీక్షా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

## దేశీ శిక్షణతో డీలర్లకు అవగాహన

- రైతులకు అవగాహన కల్పించడమే దేశీ సంకల్పం
- దేశీ ప్రోగ్రాం ఫేసిలిటేటర్ రామ్ చందర్ రావు

**తొర్రూర్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 05:**

డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్సటెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్ పుట్ డీలర్స్ ఆధ్వర్యంలో వివిధ పంటల పైన ఫెర్టిలైజర్ డీలర్స్ కు అవగాహన కల్పించడానికి దేశీ పనిచేస్తుందని దేశి ప్రోగ్రాం ఫెసిలిటేటర్ రామ్ చందర్ రావు అన్నారు . శుక్రవారం తొర్రూర్ మండలంలో ని ఖానాపురం గ్రామ శివారు లోని కాందాడి అశోక్ రెడ్డి పామాయిల్ తోటలో 40 మంది ఫర్టిలైజర్ డీలర్లకు శిక్షణలో భాగంగా క్షేత్ర సందర్శన చేశారు ఈ కార్యక్రమానికి ఉద్యాన శాఖ అధికారి రాకేష్ తో కలిసి రాంచంద్రరావు మాట్లాడుతూ వ్యవసాయం రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని ఇన్పుట్ డీలర్ ల కోసం 2003 వ సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యవసాయ నిర్వహణ విస్తరణ శిక్షణ సంస్థలు మేనేజ్ ద్వారా అమలు చేయబడుతుందని అన్నారు భారతదేశంలో దాదాపు మూడు లక్షల మంది వ్యవసాయ ఇన్ పుట్ డీలర్లు ఉన్నారన్నారు వీరు వ్యవసాయ సమాచారానికి ప్రధాన వనరుగా ఉన్నారని అన్నారు , దీని ముఖ్య ఉద్దేశం డీలర్లకు ఏ పంటపై ఏ విధమైన మందులు ఇవ్వాలని అదేవిధంగా రైతులకు ప్రోగ్రాంను అందుబాటులోకి తీసుకొచ్చిందని దీని ద్వారా ఒక్కొక్క బ్యాచ్లో 40 మంది డీలర్లు ఉంటారని వారికి ట్రైనింగ్ పద్ధతిలో అవగాహన కల్పించి వ్రాత పరీక్షలో నిర్వహించి ఉత్తీర్ణత పొందిన వారికి దేశీ డిప్లమా సర్టిఫికెట్ లు అందజేస్తారని తెలిపారు ఈ శిక్షణ ద్వారా డీలర్లకు వివిధ అంశములపై చక్కని అవగాహన కలుగుతుందని వారు రైతులకు సరైన సూచనలు సలహాలు ఇవ్వగలుగుతారని అన్నారు ఈ కార్యక్రమంలో పందిరి సాగు లో బీర ఆయిల్ ఫామ్ లో అంతర పంటల సాగు డ్రిప్ పరికరాలు పనిచేసే విధానము నిర్వహణ మామిడికాయలను బ్యాగ్ గింగ్ పద్ధతిలో కాపాడుకునే విధానము గురించి వివరంగా తెలుసుకున్నారని తెలిపారు. మహబూబాద్ జిల్లాలో 400 మంది డీలర్లు ఉండగా 160 మంది డీలర్లకు శిక్షణ పూర్తయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్స్ నారాయణ రావు, వెంగళరావు, యాకన్న, అనిల్ సురేష్, గోపాల్, నరసింహ రెడ్డి, రాకేష్, పపాలల్, భారత్, బాలోజీ పాల్గొన్నారు.






## మధిరలో చలివేంద్రం ప్రారంబించిన బ్రదర్ సంతోష్ కుమార్

**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,మధిర ఏప్రిల్ 05:**

మధిర మెయిన్ రోడ్ ఆర్ వి కాంప్లెక్స్ దగ్గర బైబిల్ ఒపెన్ యూనివర్సిటీ ఇండియా ఇంటర్నేషనల్ మరియు ఆల్ ఇండియా ట్రూ క్రిష్టియన్ కౌన్సిల్ మధిర వారు చలివేంద్రం ను ఏర్పాటు చేసారు. ఈ చలివేంద్రానికి ముఖ్య అతిధి... తెలంగాణ ఉప డైరెక్టర్ డాక్టర్,ప్రొఫెసర్, బ్రదర్ ఈ.సంతోష్ కుమార్ మరియు సిబిటి ప్రిన్సిపాల్ జీడిమెట్ల బ్రదర్ మానిక్యరావు, సిబిటి ప్రిన్సిపాల్ పెనుగంచిప్రోలు బ్రదర్ దావీదు, ఏఐటిసిసి మధిర మండలం ప్రెసిడెంట్ డి.సురేష్, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రదర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ... గిన్నెడు చన్నీళ్లు ఇచ్చిన పరలోకంలో దాని ప్రతిఫలం పోగొట్టుకోరు అన్న దేవుని మాటకు విలువనిస్తూ మధిర లొ ఉన్నటువంటి ఏ ఐ టి టి సి మండలం కమిటీ వారు ఏర్పాటు చేసిన ఈ చలివెంద్రాన్ని అనేకుల దాహర్తిని తీర్చటం అనేది గొప్ప శుభపరిణామం మరియు దేవునికి ఇష్టమైన కార్యక్రమం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొండలరావు, శ్యామ్, రమణ, శ్రీను, రాహేలు, బేబీ, పులోమాని, నయోమి, నీలిమ పాల్గొన్నారు.

## ఏడుపాయల వనదుర్గమాతను దర్శించుకున్న జంపన ప్రతాప్

- నియోజకవర్గ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రత్యేక పూజలు


**ఫోకస్ న్యూస్, కంటోన్మెంట్:**

కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలందరినీ చల్లగా చూడాలని, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ఏడుపాయల వన దుర్గామాతను దర్శించుకున్నారు. శుక్రవారం నాడు వి.ఆర్ హాస్పిటల్ ఎండి నందకిషోర్, బిల్డర్ ప్రభాకర్, కాంట్రాక్టర్ విశ్వ నాథ్, సుధీర్, శ్రీధర్ లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు జంపన ప్రతాప్, నందకిషోర్ లకు తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు.



నేటి ఫోకస్ న్యూస్
శనివారం 06, ఏప్రిల్ 2024

# బర్త్ డే స్పెషల్.. పుష్ప-2 నుంచి రష్మిక మందన్నా లుక్ విడుదల




**యానిమల్ సినిమాతో నేషనల్ వైడ్‌గా** స్టార్ స్టేటస్ దక్కించుకున్న కన్నడ కస్తూరి మన రష్మిక మందన్నా జన్మదినం సందర్భంగా హ్యాపీ బర్త్ డే రష్మిక పేరుతో మారు మ్రోగుతోంది. ఈ క్రమంలో పుష్ప-2లో ఆమె లెక్ విడుదల చేశారు. చాలా గంభీరంగా ఉన్న ఆమె లెక్ ఆకట్టుకుంటోంది. అంతేకాకుండా ఆమె అప్ కమింగ్ సినిమాలకు సంబంధించిన కొత్త అప్డేట్‌లతో సోషల్ మీడియా బద్దలు అవుతుంది. అమె నటిస్తోన్న తెలుగు చిత్రాలకు చెందిన ఫస్ట్‌లుక్‌లు రిలీజ్ చేస్తూ ఆయా చిత్రాల టీమ్స్ రష్మిక జన్మదినాన్ని మరింత క్రేజ్‌గా మార్చేశాయి. ఈ క్రమంలో ఇప్పటికే ష్మిక మందన్నా నటిస్తోన్న మూడు పాన్ ఇండియా చిత్రాలు పుష్ప 2 ది రూల్ నుంచి శ్రీవల్లి లుక్‌ను రిలీజ్ చేయగా, ఆ తర్వాత ది గీతా ఆర్ట్స్ వారి గర్ల్ ఫ్రెండ్ నాగార్జున, ధనుష్‌లతో నటిస్తోన్న కుబేరా చిత్రాల నుంచి కూడా పోస్టర్లు రిలీజ్ చేసి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దీంతో సోషల్ మీడియాలో ఈరోజు రష్మిక నామ జపం జరుపుతుండగా.. సామాజిక మాధ్యాల్లో రష్మిక పేరు ప్రథమ స్థానంలో ట్రెండింగ్ అవుతోంది. ఫ్యాన్స్, సెలబ్రిటీల నుంచి శుభాకాంక్షలు వెల్లువలా వస్తున్నాయి.






# పాత సినిమాలకు కొత్త అతుకులు.. అంతగా కనెక్ట్ కాలేకపోయిన ఫ్యామిలీస్టార్ సినిమా..

**విజయ్ దేవరకొండకి ఒక పెద్ద బ్రేక్** వచ్చి చాలా సంవత్సరాలు అవుతోంది. అటువంటి సమయంలో ఇప్పుడు ఈ 'ది ఫామిలీ స్టార్' సినిమా విడుదలైంది. దీనికి పరశురామ్ దర్శకుడు, మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించింది. దిల్ రాజు, శిరీష్ సోదరులు నిర్మాతలు. గోపి సుందర్ సంగీతం అందించారు. ఈ సినిమా శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యింది. గోవర్ధన్ (విజయ్ దేవరకొండ) ఒక మధ్యతరగతి కుటుంబంలో ఆఖరివాడు. ఇద్దరు అన్నయ్యలు, వదినలు, వాళ్ళ పిల్లలు, బామ్మ, ఇలా ఒక మధ్యతరగతి కుటుంబంలో చిన్నవాడైన గోవర్ధన్ కుటుంబాన్ని తన భుజస్కందాలపై నడిపిస్తూ వుంటారు. ఎప్పుడూ ఎక్కడ అదా చెయ్యాలి, ఎలా డబ్బులు అదా చేయొచ్చు అని చూస్తూ ఉంటాడు. ఒక అన్నయ్య ఎప్పుడూ తాగుతూ మద్యం నడిపే దుకాణదారుడితో గొడవపడుతూ ఉంటాడు. అన్నయ్య పిల్లల స్కూల్ ఫీజులు, వాళ్ళ అవసరాలు అన్నీ గోవర్ధన్ చూసుకుంటూ సంపాదనలో అన్నీ జాగ్రతగా ఖర్చు పెడుతూ ఉంటాడు. అలాగే తన కుటుంబసభ్యులని ఎవరైనా ఏమైనా అన్నా ఊరుకునే మనస్తత్వం కూడా కాదు గోవర్ధన్ ది, ఎదురుతిరిగి తగిన బుద్ధి చెపుతూ వుంటాడు. అలాంటి సమయంలో ఆ ఇంట్లోకి వస్తుంది ఇందు (మృణాల్ ఠాకూర్) అనే అమ్మాయి. గోవర్ధన్ ఉంటున్న ఇంట్లోనే మేడ మీద ఒక గది ఖాళీగా ఉంటే అద్దెకి దిగుతుంది. గోవర్ధన్ మొదట్లో ఆమెని వ్యతికేరించినా, మెల్లగా ఆమె చేస్తున్న పనులు నచ్చి ఆమెతో ప్రేమలో పడతాడు, పెళ్లి కూడా చేసుకుందాం అనుకుంటాడు. అదే సమయంలో ఆమె గోవర్ధన్ మీద ఒక థీసిస్ రాస్తుంది, అది తను చేసే మధ్యతరగతి కుటుంబం గురించిన రీసెర్చ్ అని యూనివర్సిటీ లో సబ్మిట్ చేస్తుంది. అందులో గోవర్ధన్ మధ్యతరగతి కుటుంబం గురించిన వివరాలు అన్నీ ఉంటాయి. గోవర్ధన్ ఆ పుస్తకం చదివి తన కుటుంబాన్ని మొత్తం రోడ్డుమీదకు ఇందు తీసుకువచ్చిందని, ఆమెని అసహ్యించుకుంటాడు. మధ్య తరగతి కుటుంబం అంటే పస్తులుండే కుటుంబం కాదని, తలుచు కుంటే మేము కూడా సంపన్నులం కాగలమని చూపిస్తాడు. వెంటనే తనకి ఇంతకు ముందు ఆఫర్ ఇస్తామన్న ఒక పెద్ద వ్యాపారవేత్త (జగపతి బాబు) దగ్గరికి వెళ్లి తాను ఇప్పుడు ఆ జాబ్ తీసుకుంటానని ప్రాధేయపడితే అతను గోవర్ధన్ కి ఆ జాబ్ ఇస్తాడు, అలాగే రెండు సంవత్సరాల జీతం అడిగితే అది కూడా ముందే ఇస్తాడు. తాను మధ్యతరగతి కుటుంబం కాదని, ధనవంతుల కుటుంబం అని ఇందుకు చెప్తాడు, ఆమె మీద ద్వేషం పెంచుకుంటాడు. ఇంతకీ ఈ ఇందు అనే అమ్మాయి ఎవరు? ఆమె నిజంగానే గోవర్ధన్ మధ్యతరగతి కుటుంబాన్ని వీధిలోకి లాగడం కోసమే థీసిస్ రాసిందా? ఆ వ్యాపారవేత్త గోవర్ధన్ అడగగానే వుద్యోగం, జీతం ఇచ్చి ఎందుకు పెట్టుకున్నాడు? గోవర్ధన్, ఇందు మళ్ళీ కలిసారా? వాళ్ళు పెళ్లిచేసుకున్నారా? తరువాత ఏమైంది, గోవర్ధన్ జీవితం ఎటువంటి మలుపులు తిరిగాయన్నదే 'ది ఫామిలీ స్టార్' సినిమా కథ. దర్శకుడు పరశురామ్ మంచి రచయిత. అతని ముందు సినిమాలు చూస్తే అవన్నీ అర్థం అవుతాయి. అతను, విజయ్ దేవరకొండ కాంబినేషన్ లో ఇంతకు ముందు వచ్చిన 'గీత గోవిందం' చాలా పెద్ద హిట్ అయిన సినిమా. ఇప్పుడు మళ్ళీ ఈ ఇద్దరూ ఒకటై ఈ 'ది ఫ్యామిలీ స్టార్' సినిమాతో రావటంతో ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి. స్వతహాగా సమాజం, కుటుంబ విలువలు ఇలాంటి వాటి గురించి పరశురామ్ ఇంతకు ముందు సినిమాలలో బాగా చెప్పగలిగాడు, ఈ 'ది ఫ్యామిలీ స్టార్' కూడా మధ్యతరగతి కుటుంబానికి చెందిన కథ అని ముందుగా చెప్పడంతో కొంచెం ఆసక్తి పెరిగింది. మధ్య తరగతి కుటుంబంలోకి ఒక ధనవంతురాలు/ ధనవంతుడు సాధారణ మనిషిలా వచ్చి ఆ కుటుంబలో ఒక సభ్యుడిగా మారిపోయి, ఆ కుటుంబాన్ని వాళ్ళకి తెలియకుండా ఆదుకుంటూ ఉండటం, ఆ తరువాత ఒక చిన్న సంఘటనతో వాళ్ళిద్దరిమధ్య తేడాలు రావటం మళ్ళీ కలుసుకోవటం. ఇలాంటి సినిమాలు చాలానే వచ్చాయి, ఇక్కడ పరశురామ్ కూడా అలాంటి ఒక పాత కథనే ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునికంగా చెప్పాలని అనుకున్నాడు. ఇందు అనే అమ్మాయి ఆ ఇంట్లోకి రావటం, ఆమెతో గోవర్ధన్ ప్రేమలో పడటం, ఆమె ఈ కుటుంబం గురించి రీసెర్చ్ చేసి థీసిస్ రాయటం, వాళ్ళిద్దరి మధ్యలో మళ్ళీ చిన్న తేడాలు రావటం వరకు బాగానే వుంది. అయితే ఇక్కడే పరశురామ్ కొంచెం కథ మీద దృష్టి పెట్టలేదు అనిపిస్తోంది. ఎందుకంటే రెండో సగం మొదట్లో వచ్చే ఈ అమెరికా సన్నివేశాలన్నీ ప్రేక్షకుడికి చాలా బోర్ ఫీలవటమే కాకుండా, అవన్నీ వేరే కథలా అనిపిస్తుంది. రెండో సగం అంతా దానిపైనే ఉండటం అదీ సాగదీసినట్టుగా అనిపిస్తుంది. సినిమాకి ఆయువుపట్టు అయిన పతాక సన్నివేశం కూడా దర్శకుడు అంత బాగా తీయలేదు అన్నట్టుగా అనిపిస్తుంది. ఇక నటీనటుల విషయానికి వస్తే విజయ్ దేవరకొండ మధ్యతరగతి కుటుంబంలో బాధ్యతలు మోసే అబ్బాయిగా చాలా బాగా చేసాడు. 'గీత గోవిందం' సినిమా తరువాత అటువంటి పాత్రలాగే ఇది కూడా కొంచెం వుంది అనిపిస్తుంది. విజయ్ మంచి ప్రతిభ గల నటుడు తనకిచ్చిన పాత్రల్లో ఇమిడిపోతాడు, ఇందులో కూడా అలానే గోవర్ధన్ పాత్రలో ఇమిడిపోయాడు. కానీ కథ బలంగా లేనప్పుడు అతనుమాత్రం ఏమి చేస్తాడు. ఇక మృణాల్ ఠాకూర్ పాత్ర అంత బలంగా లేదు, అదీ కాకుండా విజయ్, మృణాల్ మధ్య ఆ కెమిస్ట్రీ అంతగా వర్కవుట్ కాలేదు అనిపిస్తుంది. రెండో సగంలో వెన్నెల కిశోర్ వస్తాడు, అతని కామెడీ చూసి చూసి మరీ బోర్ అయిపోయింది. ఏ సినిమాలో చూసిన అదే వినోదం, అవే సన్నివేశాలు అతనివి అనిపిస్తుంది. 'ది ఫామిలీ స్టార్' అనే సినిమా మధ్య తరగతి కుటుంబానికి సంబందించిన కథ అని చెప్పినా, ఆ కుటుంబంలో జరిగే సంఘర్షణలని బలంగా దర్శకుడు పరశురామ్ చూపించలేకపోయాడు.




# ప్రభాస్‌తో దిశాపటాని సెల్ఫీ



**పాన్ ఇండియా స్టార్ ప్రభాస్** కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కల్కి 2898 ఏడీ'సైన్స్ ఫిక్షన్ జానర్‌లో వస్తున్న ఈ చిత్రానికి మహానటి సినిమా ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా భారతీయ పురాతన ఇతిహాసం మహాభారతం కాలం నుంచి ప్రారంభమై 2898 సంవత్సరంతో పూర్తయ్యే స్టోరీతో ఈ మూవీ రానుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. కాగా ఇటీవల చిత్ర యూనిట్.. ప్రభాస్ అండ్ దిశా పటానీపై ఒక సాంగ్ చిత్రీకరణకోసం ఇటలీ వెళ్లారు. ఇటలీలోని ఓ ఐలాండ్‌లో ప్రభాస్, దిశాపటానీపై వచ్చే రొమాంటిక్ సాంగ్ తెరకెక్కిస్తున్నారు. ఇక ఆ షూటింగ్ సెట్స్ నుంచి మూవీ టీం, టెక్నికల్ వర్కింగ్ ఫోటోలు కొన్ని వచ్చి ఇప్పటికే వైరల్ అయ్యాయి. అయితే ఈ పాటకు సంబంధించి షూటింగ్ కంప్లీట్ అయ్యినట్లు తెలుస్తుంది. దీనికి సంబంధించి తాజాగా ఆ షూటింగ్ లోకేషన్‌లో ఉన్న ఫొటోలను దిశా దిశాపటానీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇక ఈ ఫొటోలలో ప్రభాస్‌లో సెల్ఫీ కూడా దిగింది దిశాపటానీ. దీనితో పాటు ఇటలీలోని అందమైన లోకేషన్ ఫొటోలను తన ఇన్‌స్టాలో పంచుకుంది ఈ భామ. కాగా ప్రస్తుతం ఈ సెల్ఫీ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది.



